క్లుప్తంగా

ఐఓసీ మేనేజర్ సేవలు మరువలేనవి



యూఎస్ఎస్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ (ఐఓసీ) సీనియర్ మేనేజర్ యూఎస్ఎస్ రెడ్డి సేవలు మరవలేనవని వక్తలు కొనియాడారు. గురవారం ఆయన పదవీ విరమణ కార్యక్రమాన్ని నక్కనదొడ్డి గ్రామ సమీపంలోని ఐఓసీ డిపోలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి చీఫ్ జనరల్ మేనేజర్ పట్నా నాయక్ హాజరై పదవీ విరమణ పొందుతున్న యూఎస్ఎస్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీఎం హరినాథ్, డీజీఎం చక్రవర్తి, సీనియర్ మేనజర్లు కేఎస్ మోహన్‌రావు, డీఎస్ఎస్ ప్రసాద్, ఐఓసీ లైజనర్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



ఆది దంపతులకు కల్యాణం చేస్తున్న అర్చకులు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని అంబా భవాని ఆలయంలో గురువారం పార్వతీదేవి, శివుడి కల్యాణోత్సవం నిర్వహించారు. శివరాత్రి పండుగను పురస్కరించుకుని పెళ్లివస్త్రాలతో ముస్తాబు చేసిన స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపించారు. ఆది దంపతుల కల్యాణానికి హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా లింగోద్భవ ప్రత్యేక పూజలు



అలంకరణలో నగేశ్వరుడు, భోగేశ్వరుడు

పామిడి: పామిడితో పాటు మండలంలోని అన్ని శివాలయాల్లో గురువారం లింగోద్భవ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భోగేశ్వరాలయం, కన్యకా పరమేశ్వరి ఆలయంలోని నగేశ్వరుడు తదితర శివాలయాల్లో లింగోద్భవ పూజా కార్యక్రమాలు చేశారు. ఆయా ఆలయాల వేదపండితులు దేవగుడి రామేశ్వరశర్మ, చంద్రమౌళి శర్మ, అనిల్‌కుమార్ తదితరుల వేద మంత్రోచ్ఛరణల నడుమ మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేక, అర్చనలు చేపట్టారు. అందులో భాగంగా శివలింగాలను శోభాయానంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు భక్తి ప్రపత్తులతో స్వామివారిని తిలికించి తరించారు. మంగళ హారతి అనంతరం భక్తాదులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళి



ఆజాద్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని టీసీ హైస్కూల్‌లో గురువారం స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామ్‌కుమార్, ఎన్‌సీసీ యూనిట్ అధికారి రామాంజనేయులు, బీజేపీ మండల నాయకులు అంజి చౌహాన్‌నాయక్, లక్ష్మిదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీ తొలగింపు



ఫ్లెక్సీని తొలగించిన పంచాయతీ అధికారులు

శింగనమల: మండలంలోని వెస్ట్ నరసాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరమణ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను టీడీపీ నాయకుల ఒత్తిడితో గురువారం పంచాయతీ అధికారులు తొలగించారు. పంచాయతీలో టీడీపీ నాయకులు ఫ్లెక్సీలు వేయడంతో, పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరమణ ఫ్లెక్సీ వేయించారు. దీంతో టీడీపీ నాయకులు పంచాయతీ అధికారులపై వైఎస్సార్‌సీపీ నాయకుడి ఫ్లెక్సీ తొలగించాలంటూ తీవ్ర ఒత్తిడి చేశారు. ఫ్లెక్సీ విద్యుత్ స్తంభానికి కట్టారని, పంచాయతీ అనుమతి లేదని కారణాలు చూపుతూ వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీని తొలగించారు.

మూన్నాళ్ల ముచ్చటగా

కంది కొనుగోళ్లు!

- స్టాక్ నిలిచిపోవడంతో కొనుగోలుకు బ్రేక్
- ఇబ్బంది పడుతున్న అన్నదాతలు



పుట్లూరు: ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన కందుల కొనుగోలు కార్యక్రమం ముచ్చటగా మూడు రోజులకే నిలిచిపోయింది. ప్రైవేట్ మార్కెట్‌లో దళారుల దోపిడీ నుంచి బయటపడి అరకొరగా వచ్చిన దిగుబడిని విక్రయించడానికి రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపై ఆధార పడ్డారు. ఇలాంటి సమయంలో నిరంతరాయంగా నిర్వహించాల్సిన కొనుగోళ్లు.. స్టాక్ ఎక్కువగా వచ్చిందని, కొనుగోలు చేసిన కందులను తరలించకపోతే గొడౌన్‌లో నిల్వ ఉంచడానికి ఇబ్బందిగా ఉంటుందనే కారణాలను చూపడం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది.

250 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు

క్వింటాల్ రూ.7550 ప్రకారం కందులు కొనుగోలు చేస్తుండటంతో రైతులు తాము పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు విక్రయించడానికి సిద్ధయ్యారు. ఈ నెల 17న మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం వద్ద కందుల కొనుగోలు ప్రారంభించగా 250 క్వింటాళ్ల కొనుగోలు అనంతరం స్టాక్‌ను తరలించే వరకు కొనుగోలు చేపట్టబోమని అధికారులు తెలిపారు. సొసైటీ గొడోన్‌లో కందులను నిల్వ ఉంచడానికి వీలు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడి



కందుల కొనుగోలు నిలిచిపోవడంతో కేంద్రానికి తాళం వేసిన దృశ్యం

నట్లు రైతులు వాపోతున్నారు. రైతుల నుంచి సేకరించిన నిల్వలను అధికారులు త్వరితగతిన తరలించి తిరిగి కొనుగోలు ప్రారంభించాలని కోరుతున్నారు.

ఎకరాకు 2.5 క్వింటాళ్ల లోపు దిగుబడి

కంది పంట సాగు చేసిన రైతులకు ఈ ఏడాది దిగుబడి తగ్గడంతో నష్టాలు తప్పలేదు. తాడిపత్రి మండలంలో 1,958 హెక్టార్లు, పుట్లూరులో 958 హెక్టార్లు, పెద్దపప్పూరులో 450 హెక్టార్లు, యల్లనూరు మండలంలో 277 హెక్టార్లలో కంది పంటను సాగు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో కందిలో తెగుళ్ల కారణంగా క్రిమిసంహారక మందుల పిచికారీ కోసం రైతులు అధికంగా వ్యయం చేశారు. పంట పూత దశలో ఉన్న సమయంలో తుపాను ప్రభావం వల్ల దిగుబడి తగ్గిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకూ పెట్టుబడి పెట్టిన రైతులకు 2.5 క్వింటాళ్ల లోపు దిగుబడి రావడంతో నష్టాలు తప్పలేదు. ఇలాంటి సమయంలో దళారుల చేతిలో మోసపోకుండా కందులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతి రైతు నుంచి కొనుగోలు చేయాలి



రైతు సేవా కేంద్రాల్లో రిజిస్టర్ చేసుకున్న ప్రతి రైతు నుంచి కందులు కొనుగోలు చేయాలి. పంట దిగుబడి ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకునే పరిస్థితి ఉండదు. ప్రైవేట్ మార్కెట్‌లో కందులు క్వింటాల్ రూ.6,500లోపు చెల్లిస్తుండటం వల్ల కొనుగోలు కేంద్రాలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. గొడోన్‌లో ఉన్న నిల్వలను తరలించి కందులను కొనుగోలు చేయాలి.

– విష్ణునారాయణ, రైతు, కదవకల్లు

250 క్వింటాళ్ల కొనుగోలు



ఇప్పటి వరకూ మండల కేంద్రంలోని పుట్లూరు సొసైటీ నుంచి 250 క్వింటాళ్ల కందులను కొనుగోలు చేశారు. ఆ బస్తాలను గొడోన్‌లకు తరలించిన అనంతరం రైతుల నుంచి కందులను తిరిగి కొనుగోలు చేస్తామని సొసైటీ అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి కందుల కొనుగోలు ప్రారభించేలా చర్యలు తీసుకుంటాం.

– కాత్యాయని, వ్యవసాయ అధికారి, పుట్లూరు

నేడు కౌన్సిల్ సమావేశం

తాడిపత్రి రూరల్: మునిసిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశామని కమిషనర్ శివరామకృష్ణ గురవారం తెలిపారు. మునిసిపల్ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు జరుగనున్న సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో–అప్షన్ మెంబర్లు, వివిధ శాఖ అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

మున్సిపాలిటీలో రూ.3 కోట్ల ఇంటి పన్ను బకాయిలు

గుత్తి: మున్సిపాలిటీలో సుమారు రూ.3 కోట్ల ఇంటి పన్ను బకాయి ఉన్నట్లు కమిషనర్ జబ్బార్‌మియా తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పన్ను బకాయిల వసూలు కోసం మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బందితో కలసి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. అయినా పూర్తి స్థాయిలో బకాయిలు వసూలు కాలేదన్నారు. ఇంటి పన్ను బకాయిలు ఉన్న వారికి ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. నోటీసులు స్పందించక పోతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు విద్యావైజ్ఞానిక ప్రదర్శన

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఎంఈఓలు రాముడు, గురుప్రసాద్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ మండలంలోని జెడ్పీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఎగ్జిబిషన్ ప్రదర్శన ఉంటుందన్నారు.

పోసాని మురళి అరెస్ట్ అప్రజాస్వామ్యం



మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

గుంతకల్లు/తాడిపతిర: నటుడు పోసాని మురళీకృష్ణను అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమని మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఖండించారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. బుధవారం రాత్రి ఇంట్లో ఉన్న పోసానిని ముందస్తు సమాచారం ఇవ్వకుండా అరెస్టు చేయడం దారుణమన్నారు. ఆరోగ్యం బాగాలేదని చెబుతున్న వినుకుండా అరెస్టు చేయడం మంచిది కాదన్నారు. ఇటీవల వంశీ, నేడు పోసాని అరెస్టు రెడ్‌బుక్ పాలనలో భాగమేన్నారు. కూటమి ప్రభుత్వం తమ అడ్డగోలు నిర్ణయాలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు, పవన్, నారా లోకేష్‌ను అసభ్యంగా దూషించారంటూ ఎవరో పెట్టిన కేసుల ఆధారంగా పోసానిని పోలీసులు అరెస్ట్ చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. తమ నాయకుడు జగన్, ఆయన కుటుంబసభ్యులపై టీడీపీ నాయకులు, టీడీపీ సోషియల్ మీడియా ద్వారా ఎంతో మంది దూషించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి వారిపై జగన్ ప్రభుత్వంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు. పోసానిని బుధవారం అరెస్టు చేసి, గురువారం అరెస్టు చేశామని ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయడం, ఒకచోటుకు తీసుకెళ్తున్నామని మరో స్టేషన్‌కు తీసుకెళ్లడం వెనుక రహస్యం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి చట్ట వ్యతిరేక పనులకు స్వస్తి పలికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంతో చిత్తుశుద్ధి చూపాలని హితవు పలికారు. లేని పక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

చంద్రబాబు అండ్ కో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అండ్ కో చేస్తున్న దుర్మార్గాలు, దురాగతాలకు తగిన మూల్యం చెల్లించుకునే సమయం వస్తుందని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబునాయుడు చేస్తున్న తప్పుడు రాజకీయాన్ని, తప్పుడు విధానాలను, ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపుతున్న వారిపై రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, కక్షకట్టి, కేసులు పెట్టించి శునకానందం పొందుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నియంత పాలన సాగిస్తూ ప్రత్యర్థులు, కళాకారులు, విశ్లేషకులను అరెస్ట్ చేసి, వారికి న్యాయ సహాయం అందకుండా, నెలల తరబడి జైళ్లలో మగ్గేలా చేస్తూ తప్పుడు సాంప్రదాయానికి నాంది పలికారన్నారు. ఇలాంటి ఘటనలపై హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వ తీరులో ఎలాంటి మార్పులేకపోవడాన్ని చూస్తే, ఇలాంటి రాజకీయాలు రాష్ట్రానికి తీవ్ర నష్టాన్ని చేకూర్చుతాయన్నారు. నాటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన మంచితో పోల్చితే కేవలం తొమ్మిది నెలల్లో కూటమి ప్రభుత్వం ప్రజల్లో చెడ్డపేరు తెచ్చుకుందన్నారు. చట్టాన్ని అతిక్రమించి, అక్రమంగా వ్యవహరించే కొందరు పోలీసు అధికారులను విడిచిపెట్టే ప్రసక్తి ఉండదని, అందరినీ న్యాయస్థానాల ముందు నిలబెట్టే రోజు త్వరలోనే వస్తుందని కేతిరెడ్డి పెద్దారెడ్డి హెచ్చరించారు.

రీ-సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

శింగనమల: భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ సూచించారు. గురువారం మండలంలోని మట్లగొంది రెవెన్యూలో జరుగుతున్న భూముల రీ-సర్వేను ఆయన పరిశీలించారు. ప్రతి రెవిన్యూ గ్రామంలో నాలుగు టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం రెండు టీంలు, మధ్యాహ్నం రెండు టీంలు పని చేస్తాయన్నారు. రెవెన్యూ గ్రామంలోని రైతులకు ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, ఏ రోజు ఎక్కడ సర్వే జరుగుతుందో ముందుగానే తెలియజేయాలన్నారు. రీ-సర్వేను పక్కాగా చేయాలన్నారు. రెవెన్యూ గ్రామంలో ఎంతవరకు రీ-సర్వే చేశారని తహసీల్దార్ బ్రహ్మయ్య, రీ-సర్వే డీటీ పునీత్ బాబు, మండల సర్వేయర్ సీఫెన్ వరకు మార్‌తో వివరాలు తెలుసుకున్నారు. గ్రామ సర్వేయర్లు పవన్‌కుమార్, శివానంద, అదిల్ బాషా, బ్రహ్మయ్య, భాస్కర్, వీఆర్వో శ్రీధర్ రావు, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



రెయిలింగ్‌ను ఢీకొని దెబ్బతిన్న కారు

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామ శివారులో జిల్లా సరిహద్దు పొడొడ్డి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం కారును లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. తాడిపత్రికి చెందిన హరి, విష్ణు కారులో హైదరాబాదుకు వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి తాడిపత్రికి వెళ్తుండగా పొడొడ్డి వద్ద కారును వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో రోడ్డు పక్కనున్న రెయిలింగ్‌కు కారు ఢీకొని హరి, విష్ణు గాయపడ్డారు. వారిని హైవే అంబులెన్స్‌లో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వారిని వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం ఆటో బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. బుక్కరాయసముద్రం మండలం కె.కె.అగ్రహారానికి చెందిన ఒకే కుటుంబసభ్యులు శివరాత్రి సందర్భంగా ఆటోలో కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లారు. రాత్రి అక్కడ నిద్ర చేసి ఉదయం తిరిగి గ్రామానికి వెళ్తుండగా శ్రీపురం గ్రామ శివారులో దుర్గమ్మ ఆలయం వద్ద వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సరస్వతి, నరసయ్య గాయపడ్డారు. గాయపడిన వారిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా బీరప్పస్వామి రథోత్సవం



బీరప్పస్వామి రథోత్సవం



చితంబరస్వామి రథోత్సవం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని గుంతకల్లప్ప(బీరప్ప) స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం పూజారులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథంపై స్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి రథాన్ని ముందుకు లాగారు. బీరప్పస్వామి నామస్మరణతో ఆలయ పరిసరాలు హోరెత్తాయి. వందలాది మంది భక్తులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు, కురువ సంఘం కులపెద్దలు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

చితంబరిస్వామి రథోత్సవం

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో శివరాత్రి పండుగ పురస్కరించుకుని అవధూత చితంబరి స్వామి తిరునాల గ్రామస్తులు మూడు రోజులు వైభవంగా నిర్వహించారు.శివరాత్రి పండుగ జాగరణ మరుసటి రోజు చితంబరస్వామి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా గురువారం రాత్రి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చితంబరిస్వామి పుష్ప రథోత్సవాన్ని విద్యుత్ దీపాలంకరణతో అలంకరించి గ్రామంలో ఊరేగించారు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 'ఎస్ఆర్ఐటీ' ప్రభంజనం



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి తదితరులు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న 13 మంది మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి గురువారం తెలిపారు. కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ (ఏపీఐటీఏ) ద్వారా 2024–25 క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఇన్ఫోసిస్ ఫేజ్–2లో 13 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. ఉద్యోగాలు సాధించిన వారికి వార్షిక వేతనంగా రూ.3.6 లక్షలు వస్తారన్నారు. ఫేజ్–1,2 ద్వారా ఇప్పటి వరకు 21 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. ఎస్ఆర్ఐటీ కళాశాలలో 2024–25 సంవత్సరానికి గూ వివిధ కంపెనీల్లో 250 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కరెస్పాండెంట్‌తోపాటు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, అధ్యాపకులు అభినందించారు.

రాళ్లు తొలగించాలని నిరసన



ఆందోళన చేస్తున్న నాయకులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో రాళ్లను తొలగించాలని కేవీపీఎస్, దళిత, గిరిజన, ప్రజా సంఘాలు నాయకులు ఆందోళన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పక్కన సర్వే నెంబర్ 539–2, 540–2లో 71 సెంట్ల స్థలాన్ని అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం కేటాయించారన్నారు. అయితే వీటిలో అధికార పార్టీకి చెందిన నాయకులు రాళ్లు వేసుకుని కంకర వ్యాపారాలు చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన స్థలంలో రాళ్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ దాస్, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ నాయకుడు వరికూటి కాటమయ్య, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు సాకే హరి, చిన్న ఆంజనేయులు, కుళ్లాయప్ప, శివారెడ్డి, శ్రీనివాసులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్రమశిక్షణ తల్లిదండ్రుల బాధ్యత

తాడిపత్రిటౌన్: విద్యార్థుల క్రమశిక్షణ తల్లిదండ్రుల బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు పాఠశాలలో క్రమశిక్షణతో మెలగాలన్నారు. క్రమశిక్షణ లేని విద్యార్థులను టీసీ ఇచ్చి ఇంటికి పంపిచేస్తామన్నారు. తల్లిదండ్రుల గారాభం కారణంగా పిల్లల్లో క్రమశిక్షణ లోపించిందన్నారు. క్రమశిక్షణతో మెలిగితేనే పిల్లలకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగరాజు, రామగోవింద్‌రెడ్డి, శ్రీదేవి, ఓబులపతి, కాశప్ప, ధనలక్ష్మీ, రాముడు, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతి దూలం లాగుడు పోటీలు

తాడిపత్రి రూరల్: మండలంలోని తిమ్మేపల్లిలో గురువారం రాతి దూలం పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో గెలుపొందిన వృషభాలకు బహుమతులను అందజేశారు అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్ రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

గార్లదిన్నె: సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎవరైనా అపరిచితులు బ్యాంక్ అధికారులమని, మీరు లక్కీ డ్రాలో గెలుపొందారని ఫోన్ చేస్తే నమ్మొద్దన్నారు. అలాగే ఆధార్, ఏటీఎం పిన్ నంబర్, ఓటీపీ నంబర్లు అడిగితే చెప్పవద్దన్నారు. ఓటీపీలు చెబితే బ్యాంకు ఖాతాలో నగదు సులువుగా కాజేస్తారన్నారు.

మసీదులో పాము కలకలం



కేబీఎస్ మసీదు ఆవరణలో పాము ఉన్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కేబీఎస్ మసీదు ఆవరణలో గురువారం ఓ పాము కలకలం రేపింది. ప్రార్థన చేస్తున్న సమయంలో మసీదు ఆవరణలోకి పాము ప్రవేశించింది. ఆ సమయంలో అక్కడున్న ముస్లింలు, ప్రార్థనకు వచ్చిన మదరసా విద్యార్థులు భయంతో పరుగులు తీశారు. అరగంట పాటు పాము కలకలం రేపింది. స్థానికులు స్పందించి పామును చంపేశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కమిషనర్.. మాట తీరు మార్చుకోండి

గుంతకల్లుటౌన్: ప్రజా సమస్యలను విన్నవించుకునేందుకు వస్తే చాలా నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. మీ మాట తీరు మార్చుకోండి. వార్డుల్లో నెలకొన్న సమస్యలను నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరించకపోతే ప్రజల్ని తీసుకొచ్చి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం! అ టీడీపీ కౌన్సిలర్లు విద్యారాణి, మహాలక్ష్మి, మాజీ కౌన్సిలర్ రంగన్న హెచ్చరించారు. గురువారం కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను టీడీపీ కౌన్సిలర్లు ఆయన చాంబర్‌లో కలసి టెండర్ల ప్రక్రియ పూర్తయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కమిషనర్‌కు అర్జీ ఇచ్చారు. 33వ వార్డు కౌన్సిలర్ విద్యారాణి మాట్లాడుతూ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక మురుగుంతా ఇళ్లల్లోకి చేరుతోందని కాలనీవాసులు తన ఇంటి వద్ద వచ్చి ఆందోళన చేస్తున్నారని వాపోయారు. 28వ వార్డు కౌన్సిలర్ మహాలక్ష్మి, ఆమె భర్త మాజీ కౌన్సిలర్ రంగన్న మాట్లాడుతూ వార్డులో డ్రైనేజీ వేయించని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, టెండర్లు ముగిసినా పనులు చేయడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. దీంతో వారిపై కమిషనర్ సీరియస్ అయ్యారు. మీరు చెబితే నేను బెల్ కొట్టి ఎంఈని రప్పించాలా? మీరు లెటర్ ఇచ్చారు. ఆ లెటర్‌ను ఎంఈకి ఫార్వర్డ్ చేస్తాను. ఆ వర్క్‌లు ఏ ప్రోగ్రెస్‌లో ఉన్నాయో తెలుసుకోవాలంటే మీరే ఎంఈని వెళ్లి కలవండంటూ నిర్లక్ష్యంగా, గట్టిగా సమాధానమిచ్చారు. ఎమ్మెల్యే జయరాం, ఆయన సోదరుడు చెప్పిన ప్రకారమే నేను వింటానని కమిషనర్ తేల్చి చెప్పారు.

కమిషనర్ వైఖరిపై ఫిర్యాదు

ప్రజా సమస్యలు, అభివృద్ధి పనుల గురించి అడిగేందుకు వస్తే కమిషనర్ నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా సమాధానమిస్తున్నారంటూకౌన్సిలర్లు టీడీపీ నేతలకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. మనం నిర్వహించిన శుభోదయం కార్యక్రమంతో అభివృద్ధి పనులు జరుగుతాయని గొప్పలు చెప్పుకున్నాం. ఇప్పుడు చూస్తే పనులే జరగట్లేదు. సమస్యలు చెబుదామని వస్తే కమిషనర్ తీరు సరిగ్గా లేదన్నారు. వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టకపోతే సోమవారం ప్రజలను తీసుకొచ్చి మున్సిపల్ ఆఫీసు ఎదుట బైఠాయిస్తామని కౌన్సిలర్ విద్యారాణి, మాజీ కౌన్సిలర్ రంగన్న హెచ్చరించారు. తాము కమీషనర్‌తో మాట్లాడుతామని, అభివృద్ధి పనులు చేయిస్తామని టీడీపీ నేతలు సమాధానమిచ్చారు.

సోషల్ మీడియాలో వీడియోల హల్‌చల్ ...

మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో కమీషనర్ నయీమ్, సమస్యలు విన్నవించుకునేందుకు వెళ్లిన కౌన్సిలర్ల మధ్య జరిగిన సంభాషణ వీడియోలు, టీడీపీ నేతలకు కౌన్సిలర్లు ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన ఆడియోలు వాట్సాప్‌లోని పలు గ్రూప్‌లల్లో హల్‌చల్ చేశాయి. విషయం తెలుసుకున్న టీడీపీ ముఖ్యనాయకులు అప్రమత్తమై ఆ వీడియోలను వెంటనే వాట్సాప్ గ్రూప్‌లల్లో నుంచి డెలీట్ చేయించారు.

కమిషనర్ తీరుపై సర్వత్రా విమర్శలు

మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ కౌన్సిలర్లకు కనీస గౌరవమివ్వకుండా వ్యవహరిస్తున్న తీరును అధికార, ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు మండిపడుతున్నారు. ఐదు రోజుల క్రితం జరిగిన కౌన్సిల్ మీట్‌లో తన వార్డులో సమస్యలను విన్నవించిన 14వ వార్డు కౌన్సిలర్ రంగమ్మ పట్ల కూడా కమిషనర్ దురుసుగా సమాధానమివ్వడంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కమిషనర్ తీరును ఆక్షేపించిన విషయం విదితమే. తాజాగా టీడీపీ కౌన్సిలర్లు కూడా కమిషనర్ వైఖరిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.